సాక్షి చిత్తూరు

బుధవారం । 8 । మార్చి । 2023



న్యూస్‌రీల్

అందరి బంధువయా కోదండ రామయ్య..


రథోత్సవంలో భక్తజన సందోహం

శాంతిపురం: రాళ్లబూదుగూరులోని శ్రీకోదండరామస్వామి వారి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం రమణీయంగా సాగింది. 67 అడుగుల ఎత్తైన రథంలో శ్రీసీతాలక్ష్మణ సమేతుడై స్వామివారు పుర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. రథంపై ఉప్పు, మిరియాలు చల్లి పలువురు కోర్కెలు తీర్చాలని వేడుకున్నారు. రెడ్డి సంఘం, ఎల్లాగరం కోట్లకిరణ్‌కుమార్‌రెడ్డి ఉబయదారులుగా వ్యవహరించారు. పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. రథం ముందు కేరళ సంప్రదాయ వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. గ్రామస్తులు వారికి అన్న ప్రసాదాలు, పానకం పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ భరత్, పలువురు నాయకులు స్వామి వారి సేవలో పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించండి

చిత్తూరు కలెక్టరేట్ : సెక్టోరియల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.రాజశేఖర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో సెక్టోరియల్ నోడల్ అధికారి బ్రహ్మానందరెడ్డితో కలిసి సెక్టోరియల్ అధికారులతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు ఉన్నాయా లేవా పరిశీలించి నివేదిక అందజేయాలన్నారు. పట్టభద్రులకు, ఉపాధ్యాయులకు సంబంధించి వేర్వేరుగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వెబ్ కెమెరాల నిఘా ఉంటుందని తెలిపారు. ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతం వివరాలను పంపించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు.

9 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఈనెల 9 నుంచి ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. మంగళవారం డీఈవో విజయేంద్రరావు, ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ హేమారెడ్డి మాట్లాడుతూ ప్రశ్నపత్రాలు జిల్లా కేంద్రంలోని పీసీఆర్ పాఠశాల డీసీఈబీ కేంద్రంలో అందుబాటులో ఉంటాయన్నారు. ఎంఈవోలు ఈనెల 8న మధ్యాహ్నం 12 గంటలకు వీటిని తీసుకెళ్లాలని తెలిపారు.

10న ఆర్టీసీ దుకాణాలకు టెండర్లు


భాస్కర్, డిప్యూటీ సీటీఎం

తిరుపతి అర్బన్: జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లలో ఖాళీగా ఉన్న దుకాణాలను అద్దెకు ఇచ్చేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 89 దుకాణాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా డిపో మేనేజర్ కార్యాలయంలో ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 2గంటల వరకు దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని, నిర్దేశిత రుసుం చెల్లించి పొందవచ్చని సూచించారు. తిరుపతి జిల్లా ప్రజా రవాణా కార్యాయంలో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో దరఖాస్తులను వేయాలని కోరారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు బాక్స్ ఓపెన్ చేసి దరఖాస్తులు పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీ నిబంధనల మేరకు టెండర్ ఖరారు చేస్తామని వివరించారు.

స్త్రీరస్తు.. శుభమస్తు

ఆకాశంలో సగం.. ఆడదే ఆధారం.. ఆమే అన్నింటికీ మూలం.. అంటూ ఉన్నతంగా మహిళలను అందరూ కీర్తిస్తూ ఉంటారు. కానీ, కొందరు పురుషులు మాటలకే పరిమితమై స్త్రీలను వంటింటి కుందేళ్లుగా మార్చేస్తుంటారు.. మరికొందరు రాజకీయ నేతలు కేవలం ఓటర్లుగానే ఆడవాళ్లను పరిగణిస్తున్నారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టి అండగా నిలిచారు. పదవుల్లోనూ.. పాలనలోనూ ఆమెకు అగ్రపీఠం వేశారు. ప్రభుత్వం అందించిన అవకాశాలను మహిళలు సైతం అందిపుచ్చుకున్నారు. నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిస్తూ అద్భుతాలు సృష్టిస్తున్నారు.. జిల్లాను ప్రగతి పథంలో నడిపించడంలో తమ వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

- మహిళలకు అగ్రపీఠం వేసిన ప్రభుత్వం
- ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు
- రాజకీయ పదవుల్లోనూ అధిక ప్రాధాన్యం
- అవకాశాలను అందిపుచ్చుకుంటూ..
- ప్రగతి పథంలో పయనిస్తున్న పడతులు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సాక్షి, తిరుపతి : మహిళలు అబలలు కాదు, సబలలని, అవకాశం ఇస్తే ఇంటినే కాదు సమాజాన్నీ అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించగలరని నిరూపిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుంటూ విజయపథంలో పయనిస్తున్నారు. మంత్రులుగా, మేయర్లుగా, మున్సిపల్ చైర్లన్లుగా, ఎంపీపీలుగా, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులుగా, సర్పంచ్‌లుగా తమ సత్తా చాటుతున్నారు.

మహిళలదే ఆధిక్యం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 32,97,484 మంది ఓటర్లు ఉంటే, అందులో మహిళా ఓటర్లు 16,65,222 మంది ఉన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ వారి ఓట్లే విజయావకాశాలను ప్రభావితం చేస్తుంటాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిర్వహించిన కార్పొరేషన్, మున్సిపల్, పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. అందులో ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో మహిళలే అధికం. ఎన్నికలు జరిగిన స్థానాల్లో మహిళలు ఇచ్చిన తీర్పుతోనే పలువురు అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందారు. ఓటింగ్ ద్వారా విజయం సాధించిన వారిలోనూ మహిళలే ఎక్కువ మంది ఉన్నారు. తిరుపతి, చిత్తూరు నగర మేయర్లుగా డాక్టర్ శిరీష, అముద బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నామినేటెడ్ పదవుల్లోనూ స్త్రీలకే ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పించింది. అందులో భాగంగా కేజే శాంతికి ఈడిగ కార్పొరేషన్ చైర్మన్, వనితకు వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ పదవులను ఇచ్చి గౌరవించింది. అలాగే వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా సైతం ఎక్కువ మంది మహిళలకే అవకాశమిచ్చింది.

కొండంత అండగా ప్రభుత్వం

కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలకు బ్యాంకు లింకేజీతోపాటు సున్నా వడ్డీ , వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాల ద్వారా ప్రభుత్వం కొండంత అండగా నిలబడింది. పొదుపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ప్రవేశపెట్టిన ప్రతి పథకంలోనూ మహిళలనే ప్రధాన లబ్ధిదారులుగా చేర్చింది. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో నేడు ఎంతో మంది చిరు వ్యాపారాలు ప్రారంభించి లాభాలు ఆర్జిస్తూ కుటుంబానికి చేదోడుగా నిలుస్తున్నారు. అలాగే బిడ్డల చదువుకు ఇబ్బంది లేకుండా తల్లుల ఖాతాల్లో ఏటా అమ్మఒడి పథకం కింద రూ.15వేలు జమచేస్తోంది. ఈ పథకం ఎందరో పేద పిల్లలను బడి బాట పట్టించింది. సర్కారు బడులను పూర్వవైభవం తీసుకువచ్చింది.

సంక్షేమ పథకాల సమాచారం

పథకం	లబ్ధిపొందుతున్న మహిళలు	ఏటా అందిస్తున్న నిధులు
అమ్మఒడి	1,52,743	రూ.475.15 కోట్లు
వైఎస్సార్ ఆసరా	5,57,958	రూ.579.74 కోట్లు
వడ్డీలేని రుణాలు	68,440	రూ.155.23 కోట్లు
ఇంటి స్థలాలు/ఇళ్ల నిర్మాణాలు	1,74,837	రూ.1438.54 కోట్లు

ఆకాశమే హద్దుగా..




ఎక్కడో భాకరాపేటలో పుట్టిన నేను పురుషాధిక్యం ఉన్న సినీ, రాజకీయం రంగాల్లో విజయం సాధించానంటే నాపై నాకున్న నమ్మకంతో ధైర్యంగా ముందడుగు వేయడం, అలా ముందుకు వెళుతున్న నన్ను నా అన్నలు, భర్త, కుమారుడు వెన్నంటి ఉంటూ ప్రోత్సహించారు. నేడు నా సక్సెస్ వెనుక 30 ఏళ్ల శ్రమ ఉంది. ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి జగనన్న రాష్ట్రంలో మహిళలకు ఉన్నత స్థానం కల్పించారు. ప్రతి సంక్షేమం మహిళకే చెందేలా పథకాలు అమలుచేస్తున్నారు. ప్రతి విభాగంలోనూ పురుషులకు సమానంగా మహిళకు అవకాశం కల్పిస్తున్నారు. నేడు మంత్రిగా పది మందికీ సేవచేసే అవకాశం నాకు కలిగిందంటే అది ముఖ్యమంత్రి జగనన్న ఇచ్చిన ప్రోత్సాహమే. మహిళాసాధికారతను మాటల్లోగాక చేతల్లో చూపుతున్న జగనన్నకు మహిళల తరఫున సలాం చేస్తున్నా.

– ఆర్కేరోజా, పర్యాటక శాఖ మంత్రి

మహిలోసుమతి

ఓర్పునకు మారుపేరు ఆమె
ఓదార్పునకు చిరునామా ఆమె
పాలనకు సై అంటుంది ఆమె
ప్రక్షాళన దిశగా సాగుతోంది ఆమె



కట్టెలమ్మిన చోటే.. ప్రథమ పౌరురాలిగా!



నాకు 11 ఏళ్లప్పుడు మా అమ్మానాన్న ఇద్దరూ చనిపోయారు. అక్క నాగభూషణం, తమ్ముడు మేఘనాథం, చెల్లెలు బుజ్జి ఉండేవాళ్లం. మా అక్కే మమ్మల్ని పెంచింది. అడివికిపోయి కట్టెలు కొట్టి మోసుకొచ్చి అమ్మితే రూ.20 వచ్చేది. చాలాసార్లు ఆకలితో పడుకున్న రోజులు కూడా ఉండాయి. మా వీధికి తప్ప నేను ఎవరికి కూడా తెలీదు. కేవలం ముఖ్యమంత్రి జగనన్నను చూసి నాకు ఓట్లు వేశారు. కార్పొరేటర్ అయినాను. ఓరోజు మంత్రి పెద్దిరెడ్డి అన్న ఫోన్‌చేసి కార్పొరేటర్ కన్నా పెద్దపోస్టు ఇస్తా పనిచేస్తావా అమ్మా..? అని అడిగినారు. నాపై నమ్మకంపెట్టి మేయర్ చేసినారు. ఇదంతా జగనన్న దయ.

– అముద, చిత్తూరు నగర మేయర్

జగనన్నతో మహిళా సాధికారత



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళా సాధికారత సాధించే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాల్లో అగ్రస్థానంలో నిలిపారు. వైద్యురాలిగా ఉన్న నన్ను ఎమ్మెల్యే భూమన సహకారంతో తిరుపతి నగర తొలిమేయర్‌గా ఎంపిక చేశారు. బీసీ అయిన నన్ను జనరల్ మహిళా కేటగిరిలో పోటీకి దింపి మేయర్‌గా గెలిపించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండడం వెనుక జగనన్న చారిత్రక నిర్ణయాలే కారణం. అమ్మాయిలూ.. చదువుతోనే అసమానతలను దూరం చేయొచ్చు. ప్రతి విద్యార్థిని చదువుపట్ల శ్రద్ధ వహించాలి.

– డాక్టర్ శిరీష, తిరుపతి నగర మేయర్

అద్దె ఇళ్లతో అవస్థలు పడుతున్న నిరుపేద మహిళలకు సొంత గూడు కల్పించేందుకు ప్రభుత్వం వేలాది రూ.కోట్లు వెచ్చించింది. మహిళల పేరుతో ఇంటి పట్టాలు మంజూరు చేయడమే కాకుండా, పక్కా గృహాలను సైతం నిర్మించి ఇస్తోంది.

దశ'దిశ'లా రక్షణ

తెలంగాణలో జరిగిన దిశ ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా దిశ చట్టాన్ని తీసుకొచ్చారు. స్త్రీల రక్షణకు ప్రత్యేక యాప్‌ను ప్రారంభించారు. బాధిత మహిళకు సత్వర న్యాయం అందేలా పోలీసు, న్యాయ వ్యవస్థను బలోపేతం చేశారు. మహిళలకు ప్రత్యేకంగా పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. మిగిలిన పోలీస్‌స్టేషన్లు సమన్వయం చేసేందుకు ప్రత్యేకంగా ఐపీఎస్ అధికారికి బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలోనూ అండగా ఉండేందుకు గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి అందులో మహిళా పోలీసులను నియమించారు.

14,15 తేదీల్లో పుంగనూరు జాతర


జాతర వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్, నాగభూషణం, అలీమ్‌బాషా

పుంగనూరు: జమీందారుల కులదైవం శ్రీసుగుటూరు గంగమ్మ జాతరను ఈనెల 14, 15 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, సీఐ మధుసూదన్‌రెడ్డి, జమీందారు మల్లికార్జునరాయల్, పట్టణ ప్రముఖులతో జాతర ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. అలాగే ప్యాలెస్ ఆవరణను పరిశీలించారు. క్యూలు, వైద్య శిబిరాలు, చలివేంద్రాలు, షామియానాల ఏర్పాట్లపై స్థలాలను పరిశీలించి చర్చించారు. కమిషనర్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు విశేషంగా జరిగే జాతరకు వేలాది మంది భక్తులు రానున్నట్లు తెలిపారు. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండ చర్యలు తీసుకుంటామన్నారు.

భారీ వాహనాలు బైపాస్‌కు మళ్లింపు

సీఐ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ భారీ వాహనాలు, ఎక్స్‌ప్రెస్ బస్సులను బైపాస్ మార్గం ద్వారా పంపుతామని తెలిపారు. భక్తుల వాహనాలకు పుంగమ్మ చెరువు కట్టపైన పార్కింగ్ కల్పిస్తామన్నారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మంత్రి పెద్దిరెడ్డి పీఏ చంద్రహాస్, ఏఈ కృష్ణకుమార్, ఎస్‌ఐ మోహన్‌కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జాతరకు చాటింపు



శ్రీసుగుటూరు గంగమ్మ జాతరకు మంగళవారం రాత్రి చాటింపు వేశారు. ఈనెల 14న అమ్మవారికి ప్యాలెస్‌లో జమీందారులు తొలి పూజలు నిర్వహించి, పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తారు. 15న వేకువజామున అమ్మవారిని ప్యాలెస్ ఆవరణలోని ఆలయంలో కొలువుదీర్చి, భక్తుల దర్శనానికి అనుమతిస్తారు. ఆరాత్రి నిమజ్జనం నిర్వహిస్తారు.

ఆడపిల్లలకు విద్యతోనే ఆర్థికాభివృద్ధి

- జిల్లా కలెక్టర్ హరినారాయణన్
- జిల్లా సచివాలయంలో ముందస్తుగా మహిళా దినోత్సవం


కలెక్టర్ హరినారాయణన్ చేతులమీదుగా మెమెంటో అందుకుంటున్న మహిళా ఉద్యోగిని

సాక్షి, చిత్తూరు : విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని, ఆడ పిల్లలకు చదువు ఎంతో అవసరమని, తద్వారానే ఆర్థికాభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలో ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ ఆడమగ అనే వివక్ష చూపించకుండా ఇద్దరినీ సమానంగా చూడాలని తెలిపారు. మహిళలను గౌరవించడం మన సంస్కృతిలో భాగమన్నారు. కుటుంబ వ్యవస్థలో మహిళ ప్రముఖ పాత్రను పోషిస్తూ, కుటుంబ అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. మహిళల శక్తి సామర్థ్యాలు కుటుంబానికే పరిమితం కాకుండా సమాజాభివృద్ధికి తోడ్పడాలన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఏర్పాటైన స్వయం సహాయక సంఘాల అభివృద్ధి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఒకప్పుడు సైన్యంలో కొన్ని విభాగాలకు మాత్రమే పరిమితమైన మహిళలు ప్రస్తుతం సాయుధ దళాలలో కూడా పనిచేయడం హర్షణీయమని తెలిపారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు.

అన్నింటా రాణింపు

డీఆర్‌డీఏ పీడీ తులసి మాట్లాడుతూ మహిళలు కుటుంబ బాధ్యతతోపాటు పిల్లల సంరక్షణ, ఇతర బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. స్వయం సంఘాల మహిళలు స్వతహాగా వ్యాపారాలు చేసే స్థాయికి చేరుకున్నారని తెలిపారు. ఐసీడీఎస్ పీడీ నాగ శైలజ మాట్లాడుతూ మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబం ఉన్నతంగా ఉంటుందని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీడీపీఓలకు, సూపర్‌వైజర్లకు, అంగన్‌వాడీ వర్కర్లకు, సమాఖ్యలకు, వీఓలకు మెమెంటోలను అందించారు. ఎల్‌డీఎం శేషగిరి రావ్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హిమబిందు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్యలక్ష్మి, డీసీఓ (గురుకుల పాఠశాల) జయ భారతి, సీపీఓ ఉమాదేవి, డీపీఆర్‌ఓ పద్మజ, ఎపిడిమాలజిస్ట్ శ్రీవాణి పాల్గొన్నారు.


ఉత్తమ సేవలకు సత్కారం అందుకున్న మహిళా అధికారులు ఎస్సీ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, డీఆర్‌డీఏ పీడీ తులసి, సీపీఓ ఉమాదేవి

కట్టుదిట్టంగా టెన్త్ పరీక్షలు


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని డీఆర్‌వో రాజశేఖర్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై మంగళవారం డీఆర్‌వో చాంబర్‌లో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పదవ తరగతి పరీక్షలను అధికారులు సమన్వయంగా ఎలాంటి పొరబాట్లు లేకుండా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో 115 పరీక్ష కేంద్రాల్లో 21,996 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యార్థులు 436 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు ఉండేలా చూడాలని ఆదేశించారు. డీఎస్పీ శ్రీనివాస్ మూర్తి, ఆర్‌ఐఓ వి.రమేష్, డీఈఓ.విజేంద్ర రావు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పి.గురుస్వామి రెడ్డి, ఆరోగ్య శాఖాధికారి సుదర్శనం, విద్యుత్ శాఖ డీఈ. శేషాద్రి, ఆర్‌టీసీ అధికారి కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



తెప్పోత్సవాల్లో చివరి రోజు మంగళవారం రాత్రి శ్రీదేవి,భూదేవి సమేతంగా మలయప్పస్వామివారు పుష్కరిణిలో విహరించారు. వేదనాద గానాల నడుమ ఏడు సార్లు ప్రదక్షిణ చేసి భక్తు లను కటాక్షించారు. గోవింద నామస్మరణలు మిన్నంటాయి. – తిరుమల

పకడ్బందీగా ఎమ్మెల్సీ పోలింగ్

- ఎన్నికల విధులను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి
- మైక్రో అబ్జర్వర్‌లు బాధ్యతగా విధులు నిర్వహించాలి
- అబ్జర్వర్‌లు భాస్కర్, శశిధర్, రిటర్నింగ్ అధికారి హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : మైక్రో అబ్జర్వర్‌లు ఎన్నికల విధులను క్షుణ్ణంగా అర్థం చేసుకుని పోలింగ్,కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్‌లు కాటమనేని భాస్కర్, కోన శశిధర్, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ శిక్షణలో తెలిపిన అంశాలపై అవగాహన చేసుకుని పోలింగ్, కౌంటింగ్ రోజున ఎలాంటి పొరబాట్లుకు తావివ్వకుండా విధులను నిర్వహించాలని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం-నెల్లూరు- చిత్తూరు ఉపాధ్యాయ నియోజక వర్గ ఎన్నికల అబ్జర్వర్ కోన శశిధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు బ్యాంకు అధికారులను మైక్రో అబ్జర్వర్‌లుగా నియమించినట్లు తెలిపారు. విధులు కేటాయించిన అధికారులకు ఎటువంటి మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు.


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్

నిబంధనలు పాటించాలి

కలెక్టర్, రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్‌లు నిబంధనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 12న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకుని కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. ఉదయం 7 గంటలకు పీఓ పోలింగ్ ఏజెంట్లకు పాసులు ఇస్తారని చెప్పారు. 7.30 గంటలకు బ్యాలెట్ బాక్సులకు ఏజెంట్ల సమక్షంలో సీల్ వేసి పోలింగ్ నిర్వహణకు సిద్ధం చేస్తారన్నారు. 8 గంటలకు పోలింగ్ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియను మైక్రో అబ్జర్వర్‌లు పరిశీలించి అన్ని అంశాలను నివేదిక రూపంలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు సూచనలు ఇచ్చారు. రిటైర్డ్ ఏజేసీ మాస్టర్ ట్రైనర్ వీఆర్ చంద్రమౌళి పోలింగ్, కౌంటింగ్‌లో పాటించాల్సిన విధులను వివరించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డీఆర్‌వో రాజశేఖర్, మ్యాన్ పవర్ నోడల్ అధికారి జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరుకు తోట దగ్ధం

● రూ.2.5 లక్షల మేర నష్టం


దగ్ధమైన చెరుకు తోట

ఐరాల: ప్రమాదవశాత్తు చెరుకు తోట అగ్నికి ఆహుతైన సంఘటన మండలంలోని తిరువణంపల్లెలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. తిరువణంపల్లెకు చెందిన అర్జునయ్య గ్రామంలో రెండు ఎకరాల్లో చెరుకు పంట సాగు చేస్తున్నారు. ఎకరా చెరుకు పంట గానుగ పూర్తిచేశారు. మంగళవారం మధ్యాహ్నం ఎకరా చెరుకు తోటలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే అర్జునయ్యకు విషయం తెలియజేశారు. ఆయన అగ్నిమాపక శాఖాధికారులు సమాచారం ఇచ్చారు. వారు తోట వద్దకు వచ్చే సమయానికే ఎకరా చెరుకు పంట, గానుగకు సంబంధించిన క్రషర్, మోటార్ పూర్తిగా కాలిపోయాయి. రూ.2.5 లక్షల నష్టం వాటిలినట్లు బాధిత రైతు పేర్కొన్నారు. దగ్ధమైన చెరుకు తోటను మండల వ్యవసాయాధికారులు పరిశీలించారు.

మీకు గుర్తింపు కార్డు లేదా..?

భవన నిర్మాణ కార్మికులకు కార్మికశాఖ భరోసా కల్పిస్తోంది. ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం గుర్తింపు కార్డులు అందజేస్తోంది. ప్రతి గ్రామ సచివాలయంలో వైఎస్సార్ బీమాలో నమోదైన కార్మికుల వివరాలను సేకరిస్తూ గుర్తింపు కార్డు పొందేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

- భవన నిర్మాణ కార్మికులకు కార్మిక శాఖ భరోసా
- డివిజన్‌లో 25వేల మంది నమోదు
- వైఎస్సార్ బీమాతో ధీమా



చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలో భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేసి ప్రభుత్వ పథకాల లబ్ధిని అందజేసేందుకు కార్మిశాఖాధికారులు చర్యలు ప్రారంభించారు. చిత్తూరు డివిజన్ పరిధిలో 25 వేల మంది భవన నిర్మాణ కార్మికులు ఇప్పటి వరకు వైఎస్సార్ బీమాలో నమోదై ఉన్నారు. నమోదు కాకుండ ఉన్న కార్మికుల వివరాలను సేకరించి వారందరికి సంక్షేమ పథకాలు అందజేసేందుకు గ్రామ సచివాలయాల్లో వివరాలు సేకరిస్తున్నారు. వైఎస్సార్ బీమాలో నమోదైన కార్మికులు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు సభ్యుడిగా రూ.110 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలి. ఇందుకోసం సంప్రదించాల్సిన నంబర్లను అధికారులు ప్రకటించారు. చిత్తూరు రూరల్, పెనుమూరు, పూతలపట్టు, చిత్తూరు(పార్ట్ అఫ్), గుడిపాల, వి.కోట మండలాలకు చెందిన కార్మికులు ఏసీఎల్ జగదీష్‌బాబు 9492555223, బంగారుపాళ్యం, జీడీనెల్లూరు, గుడిపాల, యాదమరి, చిత్తూరు(పార్ట్ఆఫ్), కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం ఏసీఎల్ హేమాచ్చారి 9492555224, ఐరాల, తవణంపల్లె ప్రాంతాలకు ఏసీఎల్ ఆనంద్‌బాబు 9492555228 నంబర్లను సంప్రదించాలి. సమస్యలు ఉంటే జిల్లా ఇన్‌చార్జి కార్మికశాఖాధికారి ఓంకార్‌రావు 9492555216 సంప్రదించాలని అధికారులు తెలిపారు.

వీరంతా అర్హులు

భవన నిర్మాణ కార్మికుడిగా గుర్తింపు పొందేందుకు వివిధ పనులు చేసే వారికి అవకాశం ఉంది. మట్టిపనివారు, పునాది గుంతలు తీసేవారు, చదును చేసే వారు, తాపీ మేస్త్రీలు, తాపీ కూలీలు, రాడ్ బెండింగ్, కార్పెంటర్లు, పెయింటర్లు, సెంట్రింగ్ పనివారు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్స్, బండలు పరిచేవారు (మార్బుల్, గ్రానైట్, నాపరాయి, టైల్స్) పాలిష్ పనివారు, సీలింగ్ వర్కర్లు(పీఓపీ), షోకేష్ పనివారు, కంకర ముఠా కార్మికులు, రోడ్డు నిర్మాణ పనివారు, రోలర్ డ్రైవర్లు, జేసీబీ, బుల్డోజర్, క్రేన్ ఆపరేటర్లు, నిర్మాణ రంగంలోని సూపర్‌వైజర్లు, క్లర్కులు, అకౌంటెంట్లు, పాత భవనాలు పగులగొట్టేవారు గుర్తింపు పొందేందుకు అర్హులు. అలాగే వ్యర్థాలను వాహనాల ద్వారా పారబోసే కార్మికులు, ఇటుకలు తయారు చేసేవారు, క్వారీ కార్మికులు, బావులు, చెరువులు తవ్వడం, పూడికతీయడం, బోరు గుంతల పనిచేసేవారు, రోలింగ్ షట్టర్ పనివారు, ఐరన్‌గ్రిల్స్, డోర్లు, వెల్డింగ్ పనివారు, రోలింగ్ షట్టర్ పనివారు, ఐరన్ గ్రిల్స్, డోర్లు, వెల్డింగ్ పనివారు, గ్లాస్ ఉడ్ పార్టీషియన్ వర్కర్స్, ఉడ్ కార్వింగ్, పెయింటింగ్ పనివారు, ఎలివేషన్ వర్కర్స్, సిమెంట్ వరలు, సిమెంటు ఇటుకలు, పోల్స్ తయారు చేసే పనివారు అర్హులు. కార్మికుడి వయస్సు 18–60 ఏళ్లు ఉండాలి. కనీసం 90 రోజులు నిర్మాణ రంగంలో పనిచేసి ఉండాలి.

ప్రయోజనాలు

- భవన నిర్మాణ కార్మికుడిగా గుర్తింపు కార్డు కలిగిన వారికి ప్రభుత్వం అనేక ప్రయోజనాలు కల్పిస్తోంది. మహిళా కార్మికురాలు, కార్మికునిభార్య, కార్మికుని కుమార్తెకు ప్రసూతి సాయం కింద రెండు కాన్పుల వరకు రూ.20 వేలు అందజేస్తారు.
- వైఎస్సార్ పెళ్లి కానుక అర్హత లేని సామాజిక వర్గానికి ఈ గుర్తింపు కార్డుతో రూ.40 వేల సాయం చేస్తారు.
- ప్రమాదవశాత్తు మరణిస్తే కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షలు అందజేస్తారు. కార్మికుడు, కార్మికురాలు సహజంగా మరణిస్తే ఆర్థిక సాయం కింద రూ.60 వేలు అందుతుంది.
- కార్మికుని దహన సంస్కార ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు ఇస్తారు. కార్మికుల పిల్లలు చదువుతుంటే స్కాలర్‌షిప్‌లు అందజేస్తారు.

కుటుంబమంతటికీ ప్రయోజనం



భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికి గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలి. దీని వల్ల కార్మికుడితో పాటు కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతాయి. వైఎస్సార్ బీమాలో అత్యధికంగా భవన నిర్మాణ కార్మికులు నమోదయ్యారు. వీరితో ఉపాధి వేతనదారులు ఉన్నారు. వీరంతా కార్మికులుగా గుర్తింపు కార్డు తీసుకోవాలి. సందేహాలుంటే సంబంధిత ప్రాంతాల ఏసీఎల్‌ను సంప్రదించవచ్చు.

– ఓంకారరావు, జిల్లా ఇన్‌చార్జి, కార్మికశాఖ

రైలు పట్టాలపై రెండు మృతదేహాలు


దొడ్డిపల్లె వద్ద గుర్తు తెలియని శవం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో వేర్వేరు చోట్ల రైలు పట్టాలపై రెండు మృతదేహాలను మంగళవారం రైల్వే పోలీసులు గుర్తించారు. దొడ్డిపల్లె సమీపంలో 35–40 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహం పడి ఉందని, ఆత్మహత్యగా అనుమానిస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అదే విధంగా చిత్తూరు రైల్వే స్టేషన్ సమీపంలో 25–30 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించామన్నారు. ఇతని కుడిచేతిపై నీలిమ, ఎడమ చేతిపై అశ్విని అని పచ్చబొట్టు ఉందని తెలిపారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మార్చురీలో ఉంచామన్నారు. వివరాలు తెలిసిన వారు 9494228854 నంబరును సంప్రదించాలని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


రైల్వేస్టేషన్ సమీపంలో ..

రంజాన్ వేళలు

బుధవారం ఇఫ్తారి - 6:30

గురువారం సహరి - 4:49

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి


భాస్కర్‌నాయుడు(ఫైల్)

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట–చౌడేపల్లె మార్గంలో ఎర్రదిమ్మనపల్లె సమీపంలో మంగళవారం కారు ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఎస్‌హెచ్ఓ చంద్రబాబు కథనం మేరకు.. మండలంలోని వీరప్పల్లె పంచాయతీ కూరగాయల కొత్తపల్లెకు చెందిన జయరామ్ నాయుడు కుమారుడు భాస్కర్ నాయుడు(42) మంగళవారం మధ్యాహ్నం సొంత పనుల నిమిత్తం కేకేపల్లె నుంచి చౌడేపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యంలో ఎర్రదిమ్మనపల్లె వద్ద ఎదురుగా రాయలపేట వైపు వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు 108 వాహనంలో పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనలు మేరకు కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరుచోట్ల ఆరుగురు ఎర్రదొంగల అరెస్ట్


పట్టుబడ్డ ఎర్రచందనం చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి అలిపిరి : శేషాచలం అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి వేర్వేరుచోట్ల నిర్వహించిన కూంబింగ్‌లో 23 ఎర్రచందనం దుంగలు, 3 బైక్‌లు స్వాధీనం చేసుకుని ఆరుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. మంగళవారం వారు తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో మాట్లాడుతూ ఆర్ఐలు కృపానంద, చిరంజీవులు ఆధ్వర్యంలో కూంబింగ్ చేపట్టామన్నారు. ఆర్ఎస్ఐ ఆలీబాషా బృందం అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు, బాలపల్లె బీట్ పరిధిలో ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతున్న ముగ్గురిని పట్టుకున్నామని తెలిపారు. వీరి నుంచి ఒక మోటారు సైకిల్, 11 దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు మణికంఠ (28), కోలం వెంకటశేషయ్య (32), కూని వెంకటేశ్వర (21)గా గుర్తించామని వెల్లడించారు. ఆర్ఎస్ఐ టి.రాఘవేంద్ర టీమ్ వైఎస్సార్ కడప జిల్లా పాతూరు కుంట సమీపంలో డంప్ చేసిన 12ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితులు అన్నపు నరసింహులు(39), డబ్బుగోడ్డు లక్ష్మీ నరసయ్య (47), గొర్ల రాము (45)గా గుర్తించామని వివరించారు. . వీరి నుంచి రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిని ఎర్రచందనం విలువ దాదాపు రూ.30లక్షలు ఉండవచ్చునని తెలిపారు. సీఐలు చంద్రశేఖర్, బాలకృష్ణ కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిని చూసి పేర్నాటిని గెలిపించండి


మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినరగం : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కోరారు. మంగళవారం మండలంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్లను కలుసుకుని శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సర్కారు బడుల రూపురేఖలు మార్చి ప్రతి పేదవాడు ఉన్నత చదువు చదువుకునేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాసట కల్పించారని తెలిపారు. నాడు– నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. పిల్లలను ప్రతి తల్లీ బడికి పంపేలా అమ్మ ఒడిని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. గ్రామ సచివాలయాల ఏర్పాటుతో లక్షల్లో ఉద్యోగాలు కల్పించి చరిత్ర సృష్టించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బులిచ్చి ఓట్లను కొనుగోలు చేసేందుకు అడ్డదారులు తొక్కుతున్నట్లు విమర్శించారు. రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో తీసుకెళుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలపరుస్తున్న శ్యామ్ ప్రసాద్‌రెడ్డికి పట్టం కట్టాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలను కూడా సీఎం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. డిగ్రీ కళాశాల గణిత అధ్యాపకుడు ధనంజయరెడ్డి మాట్లాడుతూ విద్యాపరంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి తీసుకొస్తున్న కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా ఉంటున్నాయని తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజయ వర్మ, పలువురు నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు దగ్ధం



రామకుప్పం: మండలంలోని పులిమడుగుతండాలో సోమవారం అర్ధరాత్రి రెండు ద్విచక్రవాహనాలు దగ్ధం అయ్యాయి. ఎస్ఐ కృష్ణయ్య కథనం.. పీఎం తండాలో రమేష్‌నాయక్, సైనానాయక్ అన్నదమ్ములకు చెందిన స్కూటీ, హీరోహోండా ఇంటి ముందు పార్క్ చేసి ఉండగా రాత్రి అగ్నికి ఆహుతి అయ్యాయి. రమేష్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు చోట్ల అగ్నిప్రమాదాలు

పలమనేరు: మండలంలోని మొరం పంచాయతీ వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద మంగళవారం మంటలు చెలరేగాయి. ఎవరో నిప్పు పెట్టడంతో ఎండిన గడ్డి మండుకుని ఆపై సమీపంలోని అడవిలోకి మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

తోటలో మంటలు


పుంగనూరు: మండలంలోని పిచ్చిగుండ్లపల్లె సరిహద్దులోని శ్రీనివాసులకు చెందిన మామిడితోటలో మంగళవారం మంటలు వ్యాపించాయి. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

గణనాథుని సేవలో కర్ణాటక న్యాయమూర్తి


జస్టిస్ పండిట్‌కు స్వామివారి చిత్రపటం అందజేత

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌జీ పండిట్ దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి న్యాయమూర్తి ఆలయానికి విచ్చేయగా ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు. స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను ఏఈఓ అందించారు.

ఘనంగా కుమారధార తీర్థ ముక్కోటి


కుమారధార లోయ


తీర్థాన్ని వీక్షించిన టీటీడీ చైర్మన్ సతీమణి స్వర్ణలతారెడ్డి


కుమారధార క్షేత్రంలో వెలసి ఉన్న కుమారస్వామి

తిరుమల : తిరుమలలో మంగళవారం కుమారధార తీర్థ ముక్కోటిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తీర్థానికి విచ్చేసిన భక్తులకు శ్రీవారి సేవకులు అన్నప్రసాదాలను అందించారు. టీటీడీ విజిలెన్స్, పోలీస్, అటవీ విభాగాలు సమన్వయంతో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ప్రకృతి సౌందర్యాల నడుమ తీర్థముక్కోటిని భక్తులు దర్శించి పులకించారు.

గెలుపే లక్ష్యం.. మెజారిటీ ముఖ్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి


సమావేశానికి హాజరైన నేతలు, కార్యకర్తలు

చంద్రగిరి : వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తొండవాడ సమీపంలోని నారాయణి గార్డెన్స్‌లో ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశం నిర్వహించారు. చెవిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థులకు అత్యధిక మెజారిటీ తీసుకువచ్చేందుకు కృషి చేయాలని కోరారు. ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులుగా ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరినీ వెంటబెట్టుకుని శ్యాం ప్రసాద్‌రెడ్డికి ఓటు వేయించాలన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల తరపున పోటీ చేస్తున్న పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అత్యంత సన్నిహితుడు, విద్యావంతుడు, తన ట్రస్టు ద్వారా ఎంతో మందికి సాయం చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డికి ఓటు వేయడం వల్ల పట్టభద్రుల అందరికీ మంచి జరుగుతుందన్నారు.

10న చంద్రగిరిలో బహిరంగ సభ

వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపుకోసం ఈనెల 10వ తేదీ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు చంద్రగిరిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చెవిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ సభ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. గృహసారథులు, పట్టభద్రులు, కార్యకర్తలు, నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.